క్లుప్తంగా

బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కోవూరు: పట్టణంలోని టీఎంసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పూర్ణప్రకాష్ అండర్ – 19 బ్యాడ్మింటన్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపారు. నెల్లూరులో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ క్రమంలో విద్యార్థిని ప్రిన్సిపల్ సికిందర్ మంగళవారం అభినందించారు. ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు, ఎన్నెస్సెస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీనివాసులుకు అభినందనలను తెలియజేశారు.

టీచర్ వర్సెస్ ఎంఈఓ

వింజమూరు (ఉదయగిరి): సమాజంలో గౌరవమైన వృత్తిలో పనిచేసే ఓ ఉపాధ్యాయుడు, ఓ మండల విద్యాశాఖాధికారి అందరూ చూస్తుండగానే గొడవ పడిన ఘటన మంగళవారం సాయంత్రం మండల విద్యావనరుల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. వింజమూరు మండలంలో వివిధ పాఠశాలల్లో కొత్తగా 15 మంది టీచర్లు విధుల్లో చేరారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం వారు ఎంఈఓలు పి.రమేష్, మధుసూదన్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా యూటీఎఫ్‌కు చెందిన చెంచలబాబు ఎంఈఓ కార్యాలయానికి చేరుకుని ఎంఈఓలు, కొత్త టీచర్లతో ఫొటో దిగి వారితో ముచ్చటించి పరిచయం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న మరో ఉపాధ్యాయ సంఘం ఏపీటీఎఫ్ నేత పి.కొండారెడ్డి ఎంఈఓ కార్యాలయానికి చేరుకొని ఒక ఉపాధ్యాయ సంఘం వారిని పిలిచి తమను ఎందుకు పిలువలేదని ఎంఈఓ–2 మధుసూదన్‌రెడ్డితో మాట్లాడారు. ఈ క్రమంలో తాము ఎవరినీ పిలువలేదని, వారే వచ్చారని ఆయన సమాధానమిచ్చారు. అన్ని విషయాల్లో తాము సహకరిస్తున్నామని, ఇలాంటి విషయాల్లో కూడా తమకు సహకరించకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. ఈ క్రమంలో ఎంఈఓ–1 రమేష్ కార్యాలయ వరండాలోకి వెళ్లి తాము ఎవరినీ పిలువలేదని చెబుతుండగా ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. ఎంఈఓ–2తో మాట్లాడుతుంటే ఎంఈఓ రమేష్ తనపై నోరు పారేసుకుని దురుసుగా ప్రవర్తించారని కొండారెడ్డి వాపోయారు. ఆయన వ్యవహార తీరుపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. దీనిపై ఎంఈఓ రమేష్ మాట్లాడుతూ తాము ఏ సంఘం వారిని పిలువలేదని తెలిపారు.

బైక్‌ల ఢీ

• ముగ్గురికి గాయాలు

దుత్తలూరు: ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలైన ఘటన 565వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా గుంటుపల్లికి చెందిన నవీన్, డానియల్, రాజు అనే ముగ్గురు పనుల నిమిత్తం దుత్తలూరు వైపు వస్తున్నారు. వరికుంటపాడు మండలానికి చెందిన అబ్దుల్‌బాషా కావలి నుంచి స్వగ్రామమైన తిమ్మారెడ్డిపల్లికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో నర్రవాడ సమీపంలో పెట్రోల్ బంక్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో అబ్దుల్‌బాషా, నవీన్, డానియల్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్ ద్వారా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు.

బైక్ చోరీపై ఫిర్యాదు

సంగం: సంగం మండల కేంద్రానికి చెందిన బి.వెంకటప్రసాద్ తన స్ప్లెండర్ ప్లస్ బైక్ చోరీకి గురైందని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.
తన బైక్‌ను(ఏపీ 26 ఏఎక్స్ 2612) సంగం దువ్వూరు కాలువ సమీపంలోని మర్రిచెట్టు వద్ద ఉదయం 10.30 గంటల సమయంలో ఉంచి పనిపై వెళ్లానని, మధ్యాహ్నం 3.30 గంటల సమయానికి వచ్చి చూసేసరికి కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యాధికారుల సమ్మెకు సిబ్బంది సంఘీభావం



నల్లబ్యాడ్జీలు ధరించి సంఘీభావం తెలుపుతున్న వైద్య సిబ్బంది

ఉదయగిరి రూరల్: గత కొన్ని రోజులుగా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ వైద్యాధికారులు నిర్వహిస్తున్న సమ్మెకు గండిపాళెం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది మంగళవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఉదయగిరి పట్టణంలోని పాత సామాజిక ఆరోగ్య కేంద్ర భవనం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి తమ మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వైద్యాధికారుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది శివకుమారి, ఎన్.వెంకటేశ్వర్లు, డి.వెంకటేశ్వర్లు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..





నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురం సెంటర్‌లో రోడ్డును వెడల్పు చేసిన ప్రాంతంలో కాలువ నిర్మాణ పనులను చేపట్టారు.
వెంకటేశ్వరపురం సెంటర్ నుంచి పెన్నా బ్రిడ్జి వరకు ప్రధాన రోడ్డు పక్కన కాలువ పనుల కోసం 20 అడుగుల మేర లోతులో గుంతలు తీశారు. అయితే ఇక్కడ ఎలాంటి సూచిక బోర్డులు, బ్యారికేడ్లను ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. మరోవైపు కాలువ నిర్మాణానికి ఏర్పాటు చేసిన ఇనుప చువ్వలు ప్రమాదభరితంగా మారాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఇక్కడ సూచిక బోర్డులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిర్ణీత వ్యవధిలోపు నిర్మాణ పనులు పూర్తి



పనులను పరిశీలిస్తున్న నందన్

నెల్లూరు (బారకాసు): నగరంలోని 24వ డివిజన్ పరిధిలో చేపట్టిన డ్రెయిన్ నిర్మాణ పనులను నిర్దేశించిన సమయంలోపు నాణ్యతతో పూర్తి చేయాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. డివిజన్లోని కల్లూరుపల్లి, హౌసింగ్ బోర్డు కాలనీ, శ్రీలంక కాలనీ, ఆర్టీటీ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, గొలగమూడి రోడ్డు తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఆర్టీటీ కాలనీలో సీసీ రోడ్లు, కాలువలు, వీధి దీపాలు తదితర మౌలిక వసతులను కల్పించాలని స్థానికులు కోరగా, రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ నిర్వాహకులను సంప్రదించి.. భాగస్వాములయ్యేలా ప్రతిపాదనలను రూపొందించాలని సూచించారు. అనంతరం ఇందిరమ్మ కాలనీలో కాలువల నిర్మాణ పనులను పరిశీలించారు. కార్పొరేటర్ అరవ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.
– పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కమిషనర్ నందన్ స్పష్టం చేశారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రెవెన్యూ విభాగంతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్దేశించిన వసూళ్ల లక్ష్యాలను సాధించాలని అడ్మిన్ కార్యదర్శులకు సూచించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, టీపీఆర్వో వాసు బాబు, రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

18న భారీ సభ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు

నెల్లూరు రూరల్: రాష్ట్రంలోని నాయీబ్రాహ్మణులతో భారీ సభను తిరుపతిలో ఈ నెల 18న నిర్వహించనున్నామని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. సంజీవని స్వరం పేరుతో బహిరంగ సభను నిర్వహించనున్నామని వెల్లడించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన పత్రానికి గుర్తింపు



నెల్లూరు (టౌన్): జాతీయ స్థాయిలో విజ్ఞాన్ సంస్థ నిర్వహించిన టెక్‌ఫెస్ట్‌లో విశాఖపట్నంలోని గాయత్రి విద్యా పరిషత్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్స్‌లో చదువుతున్న నగరానికి చెందిన విద్యార్థినులు సమర్పించిన పరిశోధన పత్రానికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. తీక్షణ, వర్షిణి, బిందు, కావ్య సమర్పించిన పరిశోధన పత్రం అండర్ వాటర్ కమ్యూనికేషన్స్ యూజింగ్ లైఫై అనే అంశానికి గుర్తింపు దక్కింది. వీరిని పలువురు అభినందించారు.

ఆడపిల్లలను కాపాడుకుందాం



ర్యాలీని ప్రారంభిస్తున్న సుజాత



హాజరైన బాలికలు

నెల్లూరు(అర్బన్): ఆడపిల్లలను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని డీఎంహెచ్‌ఓ సుజాత సూచించారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని నవాబుపేట రైతుబజార్ పట్టణ ఆరోగ్య కేంద్రం నుంచి స్టోన్‌హౌస్‌పేట తదితర ప్రాంతాల్లో విద్యార్థినులతో ర్యాలీని మంగళవారం నిర్వహించారు. దీన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. నేను ఆడపిల్లను.. మార్పు నాతోనే ప్రారంభం అనే నినాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. డీఎల్‌టీఓ డాక్టర్ ఖాదర్‌వలీ, డీఐఓ ఉమామహేశ్వరి, డీపీఎంఓ రమేష్, జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ, డెమో అధికారి కనకరత్నం, పట్టణ ఆరోగ్య కేంద్ర డాక్టర్ మిస్బా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తులను పరిరక్షిస్తాం



షాదీమంజిల్‌ను పరిశీలిస్తున్న అబ్దుల్ అజీజ్

నెల్లూరు(బారకాసు): రాష్ట్రంలోని వక్ఫ్ ఆస్తులను పరిరక్షించే బాధ్యత తనది, ప్రభుత్వానిదని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. కోటమిట్టలోని షాదీమంజిల్‌ను కమిషనర్ నందన్‌తో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. అక్కడ జరుగుతున్న మరమ్మతులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జామియా మసీదు ఆస్తులను కాపాడేందుకు సర్వేను వక్ఫ్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా నిర్వహించారని, ఈ స్థలాలను విక్రయించేందుకు ముతవల్లీలు సేల్ అగ్రిమెంట్ చేయడంతో సస్పెండ్ చేశామని వివరించారు.

ఆర్ అండ్ బీ ఉద్యోగుల సాయం



నెల్లూరు(అర్బన్): నగరంలోని ఆర్ అండ్ బీ కార్యాలయంలో ప్రింటింగ్ టెక్నీషియన్‌గా పనిచేస్తూ కరోనాతో నాగవేణి మృతి చెందడంతో ఆమె కుమార్తె వెంకటసాయి రిషితకు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని రాష్ట్ర ఆర్ అండ్ బీ ఉద్యోగులు ప్రకటించారు. ఈ మేరకు ఆ శాఖ కార్యాలయంలో ఎస్‌ఈ గంగాధరం చేతుల మీదుగా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ టెక్నికల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ కుమార్ మాట్లాడారు. నాగవేణి మృతి చెందే సమయానికి ఆమె కుమార్తె మైనర్‌గా ఉన్నారని, మేజర్ అయిన తరుణంలో సాయాన్ని అందించామని తెలిపారు. ఉప పర్యవేక్షక ఇంజినీర్ రామకృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

19న అండర్ - 14 జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అండర్ – 14 బాలుర క్రికెట్ జట్టును నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో గల క్రీడా ప్రాంగణంలో ఈ నెల 19న ఎంపిక చేయనున్నామని క్రికెట్ సంఘ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు తమ సొంత కిట్‌తో వైట్ అండ్ వైట్ డ్రెస్‌తో హాజరుకావాలని కోరారు. ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలను తీసుకురావాలని.. సెప్టెంబర్ ఒకటి, 2011 తర్వాత జన్మించిన వారే అర్హులని చెప్పారు.

వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణంపై 18న సభ

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థాన పునర్నిర్మాణానికి సంబంధించిన గ్రామసభను దేవస్థాన ప్రాంగణంలో ఈ నెల 18న నిర్వహించనున్నామని ఈఓ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభకు హాజరై సలహాలు, సూచనలివ్వాలని కోరారు.

అభ్యంతరాలను తెలపండి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఇస్కపాళెంలో మూడు.. వవ్వేరులో ఒక లేఅవుట్‌కు మున్సిపాల్టీ ఆమోదం తెలిపిందని కమిషనర్ బాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటికి సంబంధించిన వివరాలను మున్సిపల్ కార్యాలయంలోని నోటీస్ బోర్డులో ఉంచామని, అభ్యంతరాలను 15 రోజుల్లో తెలియజేయాలని సూచించారు.

వాహనం ఢీకొని పెయింటర్‌కు గాయాలు

కోవూరు: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి గాయపడిన ఘటన పట్టణంలోని లారీ యార్డు సమీపంలో గల రైల్వే బ్రిడ్జి వద్ద జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలు.. నెల్లూరు నుంచి రాజుపాళెం వైపు మోపెడ్‌పై పెయింటర్ శ్యామ్ బయల్దేరారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఆయన చెట్ల మధ్యలో పడిపోయారు. అటుగా వెళ్తున్న ఓ ఆటోడ్రైవర్.. మోపెడ్‌ను గమనించి పరిసరాలను పరిశీలించగా చెట్ల మధ్యలో తీవ్ర గాయాలతో పడి ఉన్న శ్యామ్‌ను గుర్తించాడు. వెంటనే 108కు సమాచారమివ్వగా, వారొచ్చి కోవూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడ్ని ఇందుకూరుపేట మండలం గంగపట్నం వాసిగా స్థానికులు గుర్తించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణ శివారులోని ఓ నివాసంలో జరుగుతున్న పేకాట స్థావరంపై సీఐ గంగాధర్, ఎస్సై జిలానీలు మంగళవారం దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.41,500 నగదు, నాలుగు బైక్‌లు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. వారిని కోర్టుకు హాజరు పరచనున్నామని తెలిపారు.

• **కావలి(అల్లూరు):** పేకాట స్థావరంపై దాడి చేసి తొమ్మిది మంది జూదరులను పట్టుకున్న ఘటన కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై బాజిబాబు మంగళవారం వెల్లడించిన వివరాల మేరకు.. కావలి మండలం ముసునూరు సమీపంలోని ఖాళీ ప్రదేశంలో పేకాట ఆడుతున్న తొమ్మిది మంది వ్యక్తులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.18,400 నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

'సాయిపేట పంచాయతీని విడగొట్టొద్దు'

కొండాపురం: మండలంలోని సాయిపేట మేజర్ పంచాయతీని విడగొట్టొద్దని స్థానిక రైతులు తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ ఆదినారాయణకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పంచాయతీకి చెందిన ఇద్దరు, ముగ్గురు నాయకులు వారి స్వార్థం కోసం పంచాయతీని విడగొట్టేందుకు చూస్తున్నారన్నారు. పంచాయతీలో మక్కెనవారిపాళెం, ఇస్కపాళెం, కుమ్మరిపాళెం, వెల్లటూరివారిపాళెం, కొమ్మిపాళెం గ్రామాల్లో మొత్తం 5520 ఓట్లు ఉన్నాయన్నారు. పంచాయతీ ఏర్పడినప్పటి నుంచి అన్ని గ్రామాల్లో మౌలిక వసతులు, అభివృద్ధి బాగానే జరిగాయన్నారు. అంతా బాగానే ఉన్న క్రమంలో పంచాయతీని విడగొట్టడం, పేరు మార్పునకు తాము అంగీకరించలేమన్నారు. దీనిపై ఇటీవల తీర్మానం చేశారని, దీనిని మేము ఆమోదించమన్నారు.

భక్తిశ్రద్ధలతో కాత్యాయని వ్రతం



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో కాత్యాయని వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. అభిషేకాలను దేవస్థాన ప్రధానార్చకుడు సూరావఝుల రఘురామ్మూర్తి ఆధ్వర్యంలో జరిపారు. రాహుకాల దీపాలను వెలిగించారు. పూలంగిసేవను నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

ఘనంగా అబ్దుల్ కలామ్ జయంతి



కలామ్ చిత్రపటానికి నివాళులు



అవార్డులను అందుకున్న వారు

నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ మందిరంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ జయంతి వేడుకలను పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనందికేశ్వర కూచిపూడి కళాక్షేత్రాన్ని ప్రారంభించారు. అనంతరం అబ్దుల్ కలామ్ ఎక్సలెన్సీ అవార్డులను పలువురికి అందజేశారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అవార్డులను దేవసాని కొండారెడ్డి, పీఎల్ రావు, పందిటి సుబ్బయ్య, తిరుమలశెట్టి లక్ష్మీనారాయణ, వెంకటరమణయ్య, రాచపాళెం రఘు, కల్యాణి, త్యాగరాజు, రమేష్, మాధవి అందుకున్నారు. మదీనా వాచ్ కంపెనీ అధినేత ఇంతియాజ్, ఏఎం రత్నం, రమేష్‌బాబు, అందె శ్రీనివాసులు, రియాజ్‌బాషా, జయప్రకాష్, నలుబోలు బలరామయ్యానాయుడు, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

కుక్కల పట్టివేత



నెల్లూరు(బారకాసు): నగరంలోని పలు ప్రాంతాల్లో సంచరిస్తున్న గోవులు, కోతులు, కుక్కలను కార్పొరేషన్ సిబ్బంది పట్టుకొని గోశాల, అటవీ ప్రాంతం, ఏబీసీ సెంటర్‌కు తరలించారు. ఈ సందర్భంగా వెటర్నరీ వైద్యాధికారి మదన్‌మోహన్ మాట్లాడారు. ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్, ఫతేఖాన్‌పేట, పరమేశ్వరినగర్ ప్రాంతాల్లో రోడ్లపై సంచరిస్తున్న 15 గోవులను పట్టుకొని కల్లూరుపల్లి గోశాలకు తరలించామని చెప్పారు. పుత్తా ఎస్టేట్స్‌లో 22 కోతులను పట్టుకొని జిల్లా సరిహద్దు సమీపంలోని బద్వేలు అటవీ ప్రాంతంలో విడిచిపెట్టామన్నారు. నీలగిరి సంఘం, పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ ప్రాంతాల్లో సంచరిస్తున్న 12 కుక్కలను పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలోని ఏబీసీ సెంటర్‌కు తరలించి శస్త్ర చికిత్సలను చేయించామన్నారు.

ప్రైవేటీకరణ యత్నాన్ని విరమించుకోవాలి



సంతకాలను సేకరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

నెల్లూరు సిటీ: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కలివెలపాళెం, పెనుబర్తి గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సంతకాల సేకరణను చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. కోటి సంతకాల సేకరణను 45 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్నామని వెల్లడించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక వనరులను సమకూర్చుకోవాలి



కొడవలూరు: మాట్లాడుతున్న సుబ్బారావు



కొడవలూరు: హాజరైన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు

కొడవలూరు: ప్రభుత్వమిచ్చే నిధులతో సరిపుచ్చుకోకుండా ఆర్థిక వనరులను పంచాయతీలు సొంతంగా సమకూర్చుకోవాలని ఎంపీడీఓ వెంకటసుబ్బారావు సూచించారు. ఆర్థిక వనరులను సొంతంగా సమకూర్చుకోవడంపై అనే అంశంపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంచాయతీల్లో ఖాళీగా ఉన్న స్థలాల్లో పార్కింగ్‌లను ఏర్పాటు చేసి రుసుములు వసూలు చేయడం.. చేపల చెరువులను వేలమేయడం.. కూడళ్లలో గదులు నిర్మించి అద్దెకివ్వడం తదితరాలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం మాస్టర్ ట్రెయినర్లు శ్రీకాంత్, మోహనకృష్ణ అవగాహన కల్పించారు. కార్యాలయ సూపరింటెండెంట్ రామ్‌ప్రసాద్, సర్పంచ్ బుజ్జిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శ్యామ్‌సుందర్, సురేష్‌కుమార్, బ్రహ్మానందరెడ్డి, సీనియర్ సహాయకుడు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీవన ఎరువులపై అవగాహన అవసరం



కోవూరు: జీవన ఎరువులపై రైతులు అవగాహన పెంచుకోవాలని పలువురు సూచించారు. జీవన ఎరువులపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మండలంలోని పాటూరులో కేవీకే నెల్లూరు సమన్వయకర్త లలితా శివజ్యోతి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానానికి చెందిన సుమతి మాట్లాడారు. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులను వినియోగిస్తే అధిక దిగుబడులను సాధించొచ్చని చెప్పారు. కోవూరు మండల సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత, మండల వ్యవసాయాధికారి రజని, కేవీకే శాస్త్రవేత్తలు కిరణ్‌కుమార్‌రెడ్డి, విజయ్‌కుమార్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై గర్భిణులకు అవగాహన



కొడవలూరు: గండవరంలో అవగాహన ర్యాలీ



కొడవలూరు: పాతూరులో..

కొడవలూరు: బిడ్డకు ఆర్నెల్లు వచ్చేంత వరకు తల్లిపాలనే పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగభూషణమ్మ సూచించారు. రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా పిల్లలకివ్వాల్సిన పౌష్టికాహారంపై మండలంలోని గండవరంలో గల గాడికయ్యలు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీని జరిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు షంషాద్, రాజేశ్వరి, మమత, ప్రియదర్శిని, హెల్పర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

⇨ రామన్నపాళెంలోని పాతూరు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల, అంగన్‌వాడీ కార్యకర్తలు సుజన, రోజా, పావని, జానకి తదితరులు పాల్గొన్నారు.